# కోతులు — డోలర్లు

కథ

శ్రీ కవికొండల వేంకటరావుగారు

“నిరుడు మామిడి చెట్లు, ఒక్కటైనా, కాసిందిలేదు: ఊరగాయక్కూడా మొగంవాచిపోయినాం! ఈ యేడు కూడా తత్తుల్యంగానే వున్నాయిగాని చెట్లన్నీ, ఏం మహిమో! ఊరగాయల మామిడి కాసింది!” అని చెప్పి, సొంత సేవ్యం గావించడంలో అపార ప్రజ్ఞ సంపాదించిన ‘సర్వాధికార్ల సమస్త విద్యా వినోది’ అనే విప్రోత్తముడు, ఆ యేడు ఏం చేశాడూ—తీర్థానికైనా వెళ్లకుండా ఆ ఊరగాయల మామిడి చెట్టు దగ్గఱ కాపలా కూర్చోసాగాడు, పూతప్పటి నుంచీ!

మబ్బులకు పూత రాలిపోతుంటే మబ్బులను తిట్టేవాడు. పూసిన పూత అంతా నిలుస్తుందా అనేమాట మఱచిపోయే వాడు. పిందెలు ఉడుక్కి ఊడి పడిపోతూవుంటే సూర్యుణ్ణి తిట్టేవాడు. వేసిన పిందె అల్లా విత్తనం అవుతుందా అనే మాట మఱచిపోయేవాడు.

మినపగింజంత అయిందా, పెంకులెగిరిపోయేటట్లు కేక వేసేవాడు “ఎవరూ ఆ దరికి రాకూడ” దని. చూస్తే దిష్టి కొట్టేస్తుందని—గడ్డిబొమ్మను చేసి కొస కొమ్మకెక్కించాడు. దానికో వాలం పెట్టాడు. దాని మూతినదో రూపం తేల్చి, ఎఱ్ఱటిరంగు పులిమాడు. “వీరాంజనేయులు కాకుండా వెఱ్ఱి ఆంజనేయులు కాకుండా తోచాలి కోతి మూకకు,” అన్నాడు.

వాని భయం ఏమిటంటే కోతులువచ్చి ఆ కొంచెంకొంచెం గొప్పవవుతూవున్న కాయల్ని కడతేరుస్తాయేమో అని, మనుష్యుల మాట అలా వుంచి.

ఈలావుంటూ వుంటే, చెట్టు నెంత లేదన్నా, వెయ్యి సుమారు ఆ మాత్రం ఆ మాత్రం, ఉరవుగా వున్న కాయ ఊరగాయ పదునుకు వచ్చినవి తేలాయి. చెట్టుకూడా అప్పుడప్పుడు పళ్లు పడుతూవుంది. మాసంకూడా వైశాఖమాసం వచ్చేసింది. పగలు బయళ్లు ఎండలు పెళ్లుమని కాస్తున్నాయి. రాత్రిళ్లు పెరళ్లు మల్లె పువ్వులతో పరిమళిస్తూ వున్నాయి.

ఒక్క కోతీ ఆయేడు వచ్చి ఒక్క కాయూ కొరుక్కు వెళ్లిన పాపాన్ని పోలేదు. అసలు కోతులే మాయమైపోయినాయి.

దానిక్కారణం ఏమిటా అని ఆ రాత్రి—మరి మర్నాడు ఊరగాయ సరంజాం అమారుకాబోతూవుంది—కారం, ఆవ, ఉప్పు పాళ్లు పోసి కలుపుతారు—నూని ఆడించి వుంచారు—కాయ మర్నాడు మధ్యాహ్నం దింపికొని వచ్చి మఱి సాయంకాలం కొట్టి, తరిగి, కొంత ముక్క,

కొంత కాయపెట్టేస్తారు—పొలంలో చిన్న పోతుంది—ఇంటిపట్టు ఇల్లాలు ఎక్కడ లేని వొయ్యారం కాపరుస్తుంది, చిన్నమణ్ణి, సన్న మణ్ణి— — —ఆ రాత్రి చెట్టు క్రింద పడుక్కుని, అర్ధరాత్రి వేళ, సర్వాధికార్ల సమస్త విద్యా వినోదిగారు, ఆకాశంవంక చూస్తూ "ఈ యేడు ఒక్క కోతీ రాకపోవడానికి కారణం ఏమా ?" అని అలోచింపసాగాడు. ఆలా ఆలోచిస్తూ వుండే సమయంలో "అదంతా తన వట్టి గడ్డి వాలమూర్తి ప్రభావంగా" తలపోసి ఆ దిష్టి బొమ్మ కేసి చూచాడు. చూచీ చూడ్డంలో వట్టి గడ్డి రూపసి మెడలో సరీగ్గా వొక్క వెయ్యి డోలర్లదండ, పైనుండి సెర్చిలైటు వెలుగు సమేతంగా వాయువిమానంనుండి జారి పడింది! బ్రహ్మాండంగా గలగలమంది! విగ్రహం మెడ నిండా కనకం మెఱిసింది!

"కోతులు అన్నవి హిందూ దేశంలో ఎవరివీ కానట్టు తిరుగుతూవుంటాయి కాబట్టి, ఎవరికని ఈ డబ్బు ఇవ్వడమో తెలియక మేము ఆ కోతుల మెడల్లోనే మా డోలర్లను దండలుగా వేసి దండల సమేతంగా తీసుకుపోతున్నాం!" అని ఒక పెద్ద చాటింపు, బూరావూదినట్లు గావించి, యమపాశం పోసి పైకి లాగినట్టు లాగసాగారు, ఆ విమానంలోని అమెరికన్ వైజ్ఞానికులు ఈ సర్వాధికార్ల విద్యా వినోదిగారి వట్టి గడ్డి వెఱ్ఱి తొఱ్ఱి దిష్టి బొమ్మను!

సర్వాధికార్ల విద్యా వినోదిగారు, వెంటనే—అది తను ఆదాకా కాసుకు కని పెట్టుకుని ఊరగాయల మామిడి అన్న మాట మఱచి, రెమ్మ రెమ్మ ఊతంగా, పైకెగబాకి, కాయలన్నీ రాలిపోయినా సరకు చేయక, చితికి పోయినా కాతరుచేయక, ఆ దిష్టి బొమ్మ వాలం తన మొలను చుట్టేసుకున్నాడు.

క్రమంగా విమానంలోని వైజ్ఞానికులు బొమ్మనూ మన "బొమ్మన్"నూ కూడా కలిపి పైకి లాకున్నారు విమానంలోకి! "ఎవరు ఇందులో కోతి ?" అని అడిగారు వైజ్ఞానికులు! "తోక ఇద్దఱనూ కలుపుతూవుంది: ఈ తోక తెగ్గోస్తే రెండు కోతులు కాగలవా ?" అని ప్రశ్నించుకోసాగారు వారిలో వారు ఆ వైజ్ఞానికులు!

వాయు విమానం అల్లా అంతరిక్షమందు ఆగి వుంది. ఇంజన్ ఆపబడ లేదు. గంయిమంటూనేవుంది. జవాబు ఎవర్కి చెప్పాలో అర్థం కాలేదు. ఏమని చెప్పాలో అంతకన్నా తోచ లేదు, సర్వాధికార్ల విద్యా వినోదిగారికి.

విమానం నిండా, ఏభై అరవై కోతులు దాకా, నిరుడు ముందటేడు తనను వేపుకు తిన్నవన్నీ డోలర్లదండలు వేసుకుని "కిచకిచ" మంటున్నాయి ఆ విమానంలో చూచాడు! మనవాడు!

"ఆ కోతులన్నా ఈ వట్టి గడ్డి కోతి పిల్లలు. ఈ వట్టి గడ్డి కోతి నా పిల్ల! మీరెల్లా వీటిని తీసుకు వెడతారో చూస్తాను" అన్నాడు ఆర్భాటంగా. "ఎలా తీసుకువెడతామా! నీ మెళ్లోనూ ఒక డోలర్లదండ వేసి తీసుకు వెడతాం!" అని ఒక పెద్ద డోలర్లదండ ఆ సర్వాధికార్ల విద్యా

(32 వ పేజీ చూడుడు)

# కోతులు — డోలర్లు

(30 వ పేజీ తరువాయి)

వినోదిగారి మెడలో పారేశాడు ఆ విదేశీయుల్లోని ఒక మహావేత్త.

బరువుకు తూగిపోతూ స్వరాధికార్ల ఆయన "నాకు పెళ్లాంవుంది—ఇంకా పిల్లలు వున్నారు—ఊరుగాయ పెట్టే రోజూ తెల్లారి! చెట్టు నిండా కాయలున్నాయి!" అని ఎంత గోల పెట్టినా మఱి ఆ అమెరికన్ వైజ్ఞానికులకు అర్థంకాలేదు. "వుంటే మా దేశం వెళ్లాక వుత్తరం రాద్దు గానిలే! మేం బంగీద్వారా తెప్పించి పెడతాం నీకు ఊరుగాయ!" అని అన్నారేగాని అత గాణ్ణి విడిచి పెట్టలే!—

"తాజా వూరుగాయ! తాజా ఆవకాయ—మా వూరగాయల మామిడికాయతో పెట్టిన—మా ఆవిశ పెట్టిన—కాయ—కాయ—కాయ!" అంటూ వట్టి గట్టి, పీర, కాదు, వెఱ్ఱి అంజ నేయ విగ్రహాన్ని ఊరికే ఉసి గొలిపే వాడు, కసి గొద్దీ తోకట్టుకు లాగేవాడు, సర్వాధి కార్ల విద్యావినోది. కాని ప్రయోజనం లేక పోయింది!

అతగాడు మఱి భారత దేశానికి దక్కకుండా వెళ్లి పోయాడు! మఱి ఆ యేడు వాని యింటిల్లి పాదికీ వూరగాయ కాదుగదా! ఉప్పు బద్దన్నా లేకపోయింది.

★

## మన సామెతలు

1. అందానికి పెట్టిన సొమ్ము, ఆపదకు అడ్డం వస్తుంది.

2. అక్క మనది అయితే, బావ మనవాడా?

3. అత్తచచ్చిన ఆరు మాసాలకు కోడలి కంటి నీరు వచ్చినదట.

4. ఆకలి రుచి యెఱుగదు. నిద్ర సుఖ మెఱుగదు. వలపు సిగ్గు యెఱుగదు.

5. ఆడదాని చేతిలో అర్థము, మొగ వాని చేతి బిడ్డా బ్రతకదు.

6. ఇంటి దీపమని ముద్దు పెట్టు కొంటే, మూతి మీసాలన్నీ తెగగాలినవట!

7. ఇంట్లో పెండ్లి అయితే, ఊళ్లో కుక్క లకు హడావిడి.

8. ఉంగరాల చేతితో మొట్టితే నొప్పి ఉండదు.

9. ఉద్యోగం పురుష లక్షణం, అది పోతే అవలక్షణం.

10. గుళ్లో దేవునికి నైవేద్యము లేకుంటే, పూజారి పులిహోరకు ఏడ్చినాడట.

11. చద్దికూడు తిన్నమ్మ మొగుడాకలి ఎరు గదు.

12. చల్లకువచ్చి ముంత దాచుకున్నట్లు.

13. జరిగే మట్టుకు జయభేరి, జరగక పోతే రణభేరి.

14. నా యింటికి నేనేపెద్దను, పిల్లికి పెట్టరా పంగనామము.

కూర్పు: శ్రీమతి మన్యం కామేశ్వరీ దేవి గారు